సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం । 13 । ఆగస్టు । 2023



ఉచిత విద్య హామీ ఏమైంది ?
విద్యను వ్యాపారంగా మార్చడంతో పేదలు చదువుకు దూరమవుతున్నారని మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య అన్నారు. 10లో



'భారజల' కమిటీ ఎన్నిక
భారజల కర్మాగారం ఉద్యోగ సంఘం ఎన్నికల ఓట్ల లెక్కింపు ముగిసింది. అధ్యక్షుడిగా కె.శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. 8లో

గరిష్టం / కనిష్టం
33° / 24°

వాతావరణం
జిల్లాలో ఆదివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్ని చోట్ల జల్లులు పడి వాతావరణం చల్లగా మారుతుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు వైభవంగా సువర్ణ తులసీ అర్చన

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. వారాంతపు సెలవు రోజులు కావడంతో భక్తులు స్వామివారి ఆర్జిత సేవలతో పాటు దర్శనానికి బారులుదీరారు. కాగా, స్వామివారికి సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి నిత్యకల్యాణ వేడుకను శాస్త్రోక్తంగా జరిపించారు.

బీసీలకు నేడు ఆర్థిక సాయం

కొత్తగూడెంరూరల్: బీసీ చేతి వృత్తుల వారికి రెండో విడత ఆర్థిక సాయాన్ని జిల్లాలో ఆదివారం పంపిణీ చేయనున్నట్లు బీసీ కార్పొరేషన్ ఈడీ ఇందిర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదు నియోజకవర్గాల పరిధిలో 1,450 మందికి రూ.14.50 కోట్లు పంపిణీ చేయనున్నామని వెల్లడించారు. కొత్తగూడెం నియోజకవర్గ లబ్ధిదారులు 290 మందికి కొత్తగూడెం క్లబ్‌లో స్థానిక ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు చేతుల మీదుగా రూ.2.90 కోట్లు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. ఇల్లెందు నియోజకవర్గంలో (గార్ల, బయ్యారం మండలాలు కలిపి) 245 మందికి, అశ్వారావుపేటలో 289, భద్రాచలంలో 170, ఈ నియోజకవర్గ పరిధిలోని వాజేడు మండలంలో 60, వెంకటాపురం మండలంలో 60, పినపాక నియోజకవర్గంలో 286 మందికి, వైరా నియోజకవర్గ పరిధిలోని జూలూరుపాడు మండలంలో 50 మందికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందనుందని వివరించారు.

ముగిసిన 'ఎన్‌క్వాస్' పర్యటన

భద్రాచలంఅర్బన్ : భద్రాచలంలోని బస్తీ దవాఖానలను (వెల్‌నెస్ సెంటర్లు) ఎన్‌క్వాస్ బృందం సభ్యులు తమిళనాడుకు చెందిన డాక్టర్ శ్రీధర్ సుబ్రహ్మణ్యం, ఒడిశాకు చెందిన ప్రియాంక్ జైన్ సందర్శించారు. ఆయా కేంద్రాల్లో అందుతున్న వైద్య సేవలు, పేషెంట్ల పట్ల సిబ్బంది వ్యవహార శైలి, సెంటర్ నిర్వహణ, సిబ్బంది ట్రైనింగ్‌కు సంబంధించిన ధృవీకరణ పత్రాలను బృందం సభ్యులు శుక్ర, శనివారాల్లో పరిశీలించారు. రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. సెంటర్ల నిర్వహణ తదితర అంశాలపై ఎన్‌క్వాస్ బృందం సంతృప్తి చెందినట్లు సమాచారం. ఎన్‌క్వాస్‌కు వెల్‌నెస్ సెంటర్ ఎంపికైతే సంవత్సరానికి రూ.1.28 లక్షల చొప్పున మూడేళ్ల పాటు అందించనున్నారు. కాగా, రెండు రోజుల బృందం పర్యటనపై జిల్లా అధికారులు, వైద్యారోగ్య సిబ్బంది గోప్యంగా ఉంచడం పలు విమర్శలకు తావిస్తోంది.

పీఆర్సీ వేయాలి

కొత్తగూడెంఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల వేతన సవరణ సంఘం పీఆర్సీని తక్షణమే వేయాలని, జూలై 1 నుంచి మధ్యంతర భృతి ప్రకటించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.రాజు డిమాండ్ చేశారు. యూఎస్పీసీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం కొత్తగూడెంలో భారీ ర్యాలీ, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉద్యోగుల పరిస్థితి అగమ్య గోచరంగా ఉందన్నారు. రాష్ట్ర మొదటి పీఆర్సీ గడువు ముగిసినా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని, రెండో వేతన సవరణ కమిటీ వేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులపై న్యాయ వివాదాలను పరిష్కరించాలని కోరారు. ధర్నాకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి కామేష్ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో యూఎస్పీసీ నాయకులు కిషోర్ సింగ్, ఎస్.కృష్ణ, బి.హరిలాల్, బి.రాజు, మురళీమోహన్, వరలక్ష్మి, ఉమాదేవి, ఎస్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



సిరిగుండం జలపాతం నుంచి జాలువారుతున్న జలం



తొట్ల గుండం జలపాతంలో రాళ్ల మధ్య జాలువారుతున్న నీరు

కనువిందు చేస్తున్న దండగుండాల

బాహ్య ప్రపంచానికి అంతగా తెలియని ప్రకృతి సోయగం

- జాలువారుతున్న సిరిగుండం, తొట్లగుండం జలపాతాలు
- ప్రచారం చేస్తే పర్యాటకంగా అభివృద్ధి చెందే అవకాశం

సండే స్పెషల్

ఇల్లెందురూరల్: అటవీ విస్తీర్ణం అత్యధికంగా ఉన్న జిల్లాలో సహజసిద్ధమైన ప్రకృతి అందాలు అనేకం కనిపిస్తాయి. వీటిలో కొన్ని విశేష ప్రజాదరణ పొందాయి. మరికొన్ని ప్రకృతి సోయగాలపై ప్రచారం లేక జనాలను ఆకర్షించలేకపోతున్నాయి. బాహ్య ప్రపంచానికి తెలియని అనేక అందాలను అడవి తల్లి తన అమ్ముల పొదిలో దాచుకుంది. ఇల్లెందు మండలం పూబెల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని దండగుండాల అటవీ ప్రాంతంలో ఉన్న రమణీయ జలపాతాలు సైతం ఈ కోవలోకే వస్తాయి. ఇక్కడి ప్రకృతి అందాల గురించి ఎక్కువ మందికి తెలియదు. ప్రచారం సరిగా లేకపోయినా.. ఆశ్చర్యపోయేంత ప్రకృతి సౌందర్యం ఈ ప్రదేశం సొంతమని చెప్పొచ్చు. చుట్టూ దట్టమైన అడవి.. ఎత్తయిన పచ్చని కొండలు.. వాటి మధ్య నుంచి జాలువారే జలపాతాలతో ఈ ప్రాంతం కనువిందు చేస్తోంది.

సిరిగుండం, తొట్లగుండం..

దండగుండాల అటవీ ప్రాంతంలో రెండు జలపాతాలు దర్శనమిస్తాయి. ఒకటి సిరిగుండం, మరొకటి తొట్లగుండం. నేలమీదుగా వచ్చే ఊటనీటితో ఏడాదంతా జాలువారుతుండడం సిరిగుండం జలపాతం ప్రత్యేకత. చూడటానికి రెండు కళ్లు చాలవన్నంత ప్రకృతి సౌందర్యం ఈ ప్రాంతం సొంతం. ఇక గుట్టల మీదుగా ఊటనీరు దూకుతూ వచ్చి రాళ్లగుట్ట మీద పాయలుగా చీలిపోయి బండరాళ్ల మధ్యలో నుంచి జాలువారుతూ రమణీయంగా నేలమీదకు నీరు ప్రవహించే జలపాతం తొల్లగుండం. ఈ జలపాతాన్ని చూడగానే మంత్రముగ్ధులను చేస్తూ మనసుని ప్రశాంత పరిచేదిగా ఉంటుంది. సిరిగుండం, తొట్లగుండం జలపాతాలు దండగుండాల గ్రామానికి రెండు వైపులా దర్శనమిస్తాయి. ఈ రెండు జలపాతాల నుంచి జాలువారే నీటి సహాయంతో ఈ ప్రాంత రైతులు తాగు, సాగునీటి అవసరాలు తీర్చుకుంటారు. అంతేకాకుండా టేకులపల్లి మండలంలోని రోళ్లపాడు ప్రాజెక్టుకు కూడా ఈ జలపాతాలే నీటి వనరులుగా నిలుస్తున్నాయి. ప్రస్తుతం ఇల్లెందు పరిసర ప్రాంత ప్రజలు మాత్రమే ఈ జలపాతాలను తరచూ సందర్శించి సేదతీరుతుంటారు. వీటి గురించి పర్యాటక శాఖ విస్తృతంగా ప్రచారం చేస్తే జిల్లా నలుమూలలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి సైతం భారీగా తరలి వచ్చే అవకాశం ఉంటుంది. ప్రజలకు కనువిందు చేయడంతో పాటు ఈ ప్రాంతం కూడా అభివృద్ధి చెందుతుందని స్థానికులు అంటున్నారు.

పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలి



పూర్తిగా అటవీ ప్రాంతంతో కూడుకొని ఉన్న పూబెల్లి గ్రామ పంచాయతీ ప్రకృతి అందాలకు నిలయంగా ఉంది. సహజసిద్ధంగా ఏర్పడిన జలపాతాలు కనువిందు చేస్తుంటాయి. ప్రభుత్వం స్పందించి పర్యాటక ప్రాంతంగా మార్చితే ఈ ప్రాంతం మరింతగా అభివృద్ధి చెందుతుంది.

– మూతి వెంకటేశ్వర్లు, సర్పంచ్, పూబెల్లి

ఎన్నికల వేళ.. నిధులు విడుదల

- 169 పనులకు రూ.14.50 కోట్లు
- భద్రాద్రి, ములుగు కలెక్టర్లకు మార్గదర్శకాలు

భద్రాచలం: ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాష్ట్ర ప్రభుత్వం భద్రాచలం నియోజకవర్గ అభివృద్ధికి నిధులు ప్రకటించింది. మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ సూచనల మేరకు పలు అభివృద్ధి పనులకు ఈ నిధులు కేటాయిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ మేరకు భద్రాద్రి, ములుగు కలెక్టర్లు చర్యలు చేపట్టాలని ఆదేశించింది. దీంతో అభివృద్ధి పనుల కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఏజెన్సీ ప్రజలు కొంత మేర హర్షం వ్యక్తం చేస్తున్నప్పటికీ.. సీఎం కేసీఆర్ ప్రకటించిన రూ.1,000 కోట్లు ఎప్పుడు విడుదల చేస్తారని ప్రశ్నిస్తున్నారు.

169 పనులకు నిధులు..

బాలసాని ఎమ్మెల్సీగా ఉన్నప్పుడు భద్రాచలం నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని పలుమార్లు ప్రభుత్వాన్ని కోరారు. ఎమ్మెల్సీగా ఆయన పదవీకాలం ముగియడంతో ఇటీవల బీఆర్ఎస్ భద్రాచలం నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియమించారు. దీంతో మళ్లీ భద్రాచలం అభివృద్ధికి నిధులు కేటాయించాలని సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు విన్నవించడంతో నియోజకవర్గంలోని 169 పనులకు రూ. 14.50 కోట్లు ఎస్సీ, ఎస్టీ ఎస్‌డీఎఫ్ ద్వారా విడుదల చేస్తున్నట్లు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిధులతో భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల, వెంకటాపురం, వాజేడు మండలాల్లో పలు పనులు చేపట్టనున్నారు. పనుల వేగవంతానికి చర్యలు తీసుకోవాలని భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాల కలెక్టర్లను ఆదేశిస్తూ ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె.రామకృష్ణరావు ఉత్తర్వులు విడుదల చేశారు.



అభివృద్ధి చేయనున్న భద్రాచలంలోని అంబేద్కర్ సెంటర్

చేపట్టనున్న పనులివే..

- భద్రాచలంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి రూ.2 కోట్లు, ప్రధాన రహదారులపై సెంట్రల్ లైటింగ్‌కు రూ.2 కోట్లు, కాలనీల్లో అంతర్గత రోడ్ల నిర్మాణానికి రూ.1.50 కోట్లు వినియోగించనున్నారు.
- దుమ్ముగూడెం మండలంలో రూ.1.50 కోట్లతో రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం
- చర్ల మండలంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి రూ.50 లక్షలు, రూ.కోటితో రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం
- వెంకటాపురం మండలం పాత్రాపురం వద్ద బల్లకట్టు వాగుపై రోడ్ కం బ్రిడ్జికి రూ.కోటి, సెంట్రల్ లైటింగ్‌కు రూ. కోటి, ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు రూ.50 లక్షలు, రోడ్లు, రూ.2.50 కోట్లతో ఇతర పనులు
- వాజేడు మండలంలో రూ.1.5 కోట్లతో అంతర్గత రోడ్లు, డ్రెయినేజీలు

రూ. 100, 1,000 కోట్లు ఏవీ ?

ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఈ నిధుల విడుదలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. భద్రాచలం అభివృద్ధి తమతోనే సాధ్యమని, కేసీఆర్ హామీ మేరకు తొలి విడతగా ఈ నిధులు విడుదలయ్యాయని, ఆ తర్వాత మళ్లీ వస్తాయని బీఆర్ఎస్ నేతలు అంటుండగా, ఇది ఎన్నికల స్టంటేనని విపక్షాలు విమర్శిస్తున్నాయి. భద్రాచలం నియోజకవర్గంపై ప్రేముంటే ముందుగా పేర్కొన్న రూ.100 కోట్లు, గోదావరి ముంపు బాధితుల శాశ్వత నివాసాలకు ప్రకటించిన రూ.1000 కోట్ల నిధులేవని ప్రతిపక్ష నేతలు ప్రశ్నిస్తున్నారు. ఇది ప్రజలను మోసగించడమేనని ఆరోపిస్తున్నారు.

అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది



భద్రాచలం నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. కేసీఆర్, కేటీఆర్ చొరవతో ప్రత్యేక నిధులు విడుదలయ్యాయి. ఇది ప్రారంభం మాత్రమే. ప్రస్తుతం సుభాష్‌నగర్ వద్ద ఉన్న కరకట్టకు కొనసాగింపుగా గతంలో ఉన్న డిజైన్ ప్రకారం పొడిగించేందుకు మరో రూ.35 కోట్లు విడుదల కానున్నాయి. వీటితో పాటు అనేక పనులకు శ్రీకారం చుడతాం.

– బాలసాని లక్ష్మీనారాయణ, మాజీ ఎమ్మెల్సీ

కంటి తుడుపు చర్యలే



ఈ నిధుల విడుదల కేవలం కంటి తుడుపు చర్యే. భద్రాచలం అభివృద్ధికి ప్రకటించిన రూ.100 కోట్లు, రూ.1000 కోట్లు విడుదల చేయని ప్రభుత్వానికి, ఇప్పుడు భద్రాచలం నియోజకవర్గ ప్రజలు గుర్తొచ్చారంటే హాస్యాస్పదంగా ఉంది. సంపూర్ణ అభివృద్ధికి నిధులు విడుదల చేయాలి.

–పొదెం వీరయ్య, ఎమ్మెల్యే

'గృహలక్ష్మి' విచారణకు సిద్ధంగా ఉండండి

అధికారులకు కలెక్టర్ ఆదేశం

సింగరేణి(కొత్తగూడెం): గృహలక్ష్మి పథకానికి దరఖాస్తుల స్వీకరణ గడువు ముగిసినందున విచారణ ప్రక్రియ చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల అధికారులను ఆదేశించారు. అన్ని శాఖల జిల్లా అధికారులు, రెవెన్యూ, పంచాయతీరాజ్, మండల ప్రత్యేక అధికారులతో శనివారం నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడుతూ.. అర్హుల జాబితా రూపకల్పనలో పాటించాల్సిన మార్గదర్శకాలపై దిశానిర్దేశం చేశారు. వచ్చిన దరఖాస్తుల ఆధారంగా ఈనెల 20వ తేదీ నాటికి క్షేత్రస్థాయిలో విచారణ ప్రక్రియ పూర్తిచేయాలన్నారు. విచారణ ప్రక్రియను మండలాల ప్రత్యేకాధికారులు పరిశీలించాలని సూచించారు. పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులతో కమిటీ వేయనున్నట్లు చెప్పారు. విచారణ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా సాగాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. మండల, మున్సిపల్ స్థాయిలో విచారణ నిర్వహణపై సిబ్బందికి అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇంటింటి సర్వే చేసి లబ్ధిదారులను ఎంపిక చేయాలని, ఆ తర్వాత ఆర్డీఓ ధ్రువీకరణతో జాబితా నివేదికలు అందజేయాలని చెప్పారు. టెలీ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు రాంబాబు, మధుసూదన్ రాజు, జెడ్పీ సీఈఓ విద్యాలత, డీపీఓ రమాకాంత్, కొత్తగూడెం భద్రాచలం ఆర్డీఓలు శిరీష, మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల

దండిగా దరఖాస్తులు..

బూర్గంపాడు: పేదల ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న గృహలక్ష్మి పథకానికి జిల్లా వ్యాప్తంగా దరఖాస్తులు భారీ సంఖ్యలో వచ్చాయి. పేదల సొంత ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ 3 లక్షల ఆర్థిక సాయం అందించేందుకు ఈనెల 10 వరకు దరఖాస్తులు స్వీకరించగా జిల్లాలో 86 వేల మందికి పైగా అప్లికేషన్లు పెట్టుకున్నారు. ఇందులో అశ్వారావుపేట నియోజకవర్గంలో 20,176, కొత్తగూడెంలో 14, 978, భద్రాచలంలో 18, 848, పినపాకలో 17,989, ఇల్లెందు నియోజకవర్గం నుంచి 11,607 మంది దరఖాస్తు చేసుకున్నారు.

ప్రధాన మెట్లపై బురద తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

భద్రాచలంటౌన్: భద్రాచలం వద్ద గోదావరి నదికి ఇటీవల వచ్చిన వరదలకు ఒండ్రు పేరుకుపోయి స్నానఘట్టాల వద్ద బురదమయంగా మారింది. దీంతో నదిలో స్నానం చేసేందుకు భక్తులు పడుతున్న ఇబ్బందులపై ఈనెల 11న సాక్షిలో 'వరద తగ్గింది..బురద మిగిలింది' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన అధికారులు ప్రధాన మెట్లపై ఆడుగు మందం పేరుకుపోయిన బురదను డోజర్ ట్రాక్టర్‌తో నదిలోకి తోసే ప్రక్రియను శనివారం చేపట్టారు. మెట్లపై అడ్డంగా ఉన్న భారీ వృక్షం మోడును సైతం తొలగించారు. గోదావరి నుంచి మోటార్లతో నీటిని తోడి మెట్లను శుభ్రం చేస్తున్నారు. విద్యుత్ లైన్లపై ఉన్న చెత్తను తొలగించి సరఫరా పునరుద్ధరించి లైట్లు ఏర్పాటు చేశారు.



ప్రధాన మెట్లపై మట్టిని తొలగిస్తున్న సిబ్బంది

అభివృద్ధి నిరోధకులను తరిమికొట్టండి



బూరుగుపాడులో మాట్లాడుతున్న ఎస్పీ వినీత్

- ఏజెన్సీ ప్రాంత రక్షణ, ఆదివాసీల ఆరోగ్యమే పోలీస్ శాఖ లక్ష్యం
- ఎస్పీ డాక్టర్ వినీత్

చర్ల: మావోయిస్టుల చర్యలతో వెనుకబడుతున్న ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా పోలీసు శాఖ పని చేస్తోందని ఎస్పీ డాక్టర్ వినీత్ అన్నారు. చర్ల మండలంలోని పలు మారుమూల గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు శనివారం ఆయన ఓఎస్‌డీ సాయి మనోహర్, భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్‌తో కలిసి ఆయన శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ముందుగా మావోయిస్టు ప్రాబల్య గ్రామమైన బూరుగుపాడులో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎస్పీ మాట్లాడుతూ.. ఆదివాసీల అభివృద్ధితో పాటు వారి ఆరోగ్య బాధ్యత కూడా తీసుకుంటున్నామని చెప్పారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అభివృద్ధి నిరోధకులుగా వ్యవహరిస్తున్న వారిని గ్రామాల పొలిమేరల్లోకి కూడా రాకుండా తరమాలని పిలుపునిచ్చారు. అనంతరం చర్ల – పూసుగుప్ప ప్రధాన రహదారిలో రూ.5.50 కోట్లతో నిర్మించిన నాలుగు హైలెవల్ వంతెనలను ప్రారంభించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో వద్దిపేటలోని సీఆర్‌పీఎఫ్ 81 బెటాలియన్ క్యాంపును వరద నీరు ముంచెత్తగా దానికి రక్షణ కోసం రూ.75 లక్షలతో నిర్మిస్తున్న రిటర్నింగ్ వాల్ పనులకు శంకుస్థాపన చేశారు. వివిధ గ్రామాల్లో ఆదివాసీలు లబ్ధి పొందేందుకు 15 గానుగ మిల్లులను పోలీసు శాఖ ప్రత్యేక నిధులు రూ.48 లక్షలతో ఏర్పాటు చేయగా ఉంజుపల్లిలో ఎస్పీ ప్రారంభించారు. లెనిన్‌కాలనీలో ఏర్పాటు చేయనున్న స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు స్థల పరిశీలన చేశారు. ఆయా కార్యక్రమాల్లో సీఐలు బి. రాజ్‌గోపాల్, బి.అశోక్, రాజువర్మ, ఎస్సై సూరి, వైద్యాధికారులు శ్రీధర్, దివ్యనయన, మోనిక, కాంత్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే నా ధ్యేయం

ఎమ్మెల్యే వనమా వెల్లడి

పాల్వంచరూరల్/సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం, పాల్వంచతో పాటు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల అభివృద్ధే తన ధ్యేయమని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం ఆయన కొత్తగూడెం, పాల్వంచ మండలం రంగాపురంలో విలేకరులతో మాట్లాడారు. ఇప్పటివరకు రూ.3వేల కోట్లతో పలు అభివృద్ధి పనులు చేశామని చెప్పారు. సూర్యచంద్రులు ఉన్నంతవరకు ఈ నియోజకవర్గం కళకళలాడడమే తన సంకల్పమన్నారు. అభివృద్ధి పనులకు ఎన్నికోట్లయినా ఇస్తానని సీఎం కేసీఆర్ చెప్పడమే కాక కార్యాచరణ దిశగా నిధులు మంజూరు చేయడం తన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. ప్రజల సహకారంతో కొత్తగూడెంను నంబర్ ఒన్ స్థానంలో నిలబెడతానని చెప్పారు. పట్టణంలో పలు అభివృద్ధి పనులు చేశామని, త్వరలోనే మంత్రులు హరీశ్‌రావు, పువ్వాడ అజయ్‌కుమార్‌ను తీసుకొచ్చి ఆస్పత్రి అభివృద్ధికి శ్రీకారం చుడుతానని ప్రకటించారు. అంతకుముందు పాల్వంచ మండలం నాగారంలో కొట్టుకుపోయిన చెక్‌డ్యామ్‌ను వనమా పరిశీలించారు. దీనిపై ఓ కమిటీ వేసి విచారణ చేపడతామని, కారకులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యమే కారణమని తేలితే చర్య తీసుకోవడంతో పాటు వారిని బ్లాక్‌లిస్ట్‌లో పెడతామన్నారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్ రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, వైస్ చైర్మన్ దామోదర్ యాదవ్, ఎంపీపీలు బాదావత్ శాంతి, మడివి సరస్వతి, వనమా రాఘవేందర్‌రావు, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, ఇరిగేషన్ డీఈ ఎం.రాజి, ఏఈఈ మంగు, పెద్దమ్మ గుడి చైర్మన్ మహీపతి రామలింగం, మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్యా రాంబాబు, సొసైటీ చైర్మన్ మండే వీరహనుమంత రావు తదితరులు పాల్గొన్నారు.



కొత్తగూడెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వనమా

క్లుప్తంగా

పురుగుల మందు తాగి ఆత్మహత్య

టేకులపల్లి: పురుగుల మందు తాగి ఓ వ్యక్తి శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ రమణారెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని కొత్తతండా(జి) గ్రామానికి చెందిన బోడ రాములు(56) మద్యానికి బానిసై ఏ పనీ చేయకుండా తిరుగుతున్నాడు. ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. శుక్రవారం కూడా గొడవ జరగ్గా మనస్తాపం చెందిన పురుగుల మందు తాగుడు. అనంతరం చేనుకు వెళ్లి భార్యకు విషయం చెప్పడంతో కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

పాల్వంచ: పట్టణ పరిధిలోని జగ్గుతండాకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ మణికంఠ (24) మద్యానికి బానిస కావడంతో భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈనెల 10న కూడా గొడవ జరిగింది. దీంతో ఇంటి నుంచి బయటకు వెళ్లిన మణికంఠ పురుగుల మందు తాగాడు. దీంతో కుటుంబీకులు ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఎస్‌ఐ రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దమ్మపేటలో మరొకరు..

దమ్మపేట: దమ్మపేటకు చెందిన చవ్వాల వెంకటేశ్వరరావు మద్యానికి బానిస కావడంతో భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెంది ఈ నెల 10న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు దమ్మపేట ప్రభుత్వ ఆస్పత్రికి, అనంతరం సత్తుపల్లికి తరలించగా, చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రవికుమార్ తెలిపారు.

రూ.10 లక్షల సామగ్రి చోరీ

పాల్వంచ:పట్టణంలోని సీతారాంపట్నంలో మెగా ఇంజనీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ స్టోర్స్‌లో ఈ నెల 5న తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు రూ.10.61లక్షల విలువైన సామగ్రిని చోరీ చేశారు. కంపెనీ ప్రతినిధుల ఫిర్యాదుమేరకు ఎస్‌ఐ బి.రాము కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో ఇద్దరు మృతి

- వీధిలైట్లు అమరుస్తూ ఒకరు..
- చెట్టు నరుకుతూ మరొకరు మృత్యువాత
- రోడ్డున పడ్డ రెండు కుటుంబాలు



మృతుడు పెనుబల్లి కన్నారావు



విద్యుదాఘాతంతో చెట్టుపైనే మృతి చెందిన గోపయ్య

అశ్వారావుపేట/దుమ్ముగూడెం: విద్యుదాఘాతంతో వేర్వేరు చోట్ల శనివారం ఇద్దరు మృతి చెందారు. గ్రామపంచాయతీలో వీధిలైట్లు అమర్చుతుండగా విద్యుదాఘాతానికి గురై ఎలక్ట్రీషియన్ మృతి చెందిన సంఘటన అశ్వారావుపేట మండల పరిధిలోని వినాయకపురంలో జరిగింది. గ్రామపంచాయతీలో వీధిలైట్లు అమర్చేందుకు మొద్దులమడ గ్రామానికి చెందిన ఎలక్ట్రీషియన్ పెనుబల్లి కన్నారావు(24)ను తాత్కాలికంగా నియమించుకున్నారు. రోజుకు రూ.500 చొప్పున కూలి ఇస్తుండగా, 20 కిలోమీటర్ల నుంచి వినాయకపురం వచ్చి పనిచేస్తున్నాడు. శనివారం గ్రామపంచాయతీ కార్యదర్శి, సర్పంచ్‌లు వీధిలైట్లు అమర్చేందుకు ఎలక్ట్రీషియన్‌ను స్తంభం ఎక్కించారు. ట్రాన్స్‌కో శాఖాధికారులకు సమాచారం ఇవ్వకపోవంతో విద్యుత్ సరఫరా నిలిపివేయలేదు. దీంతో కన్నారావు విద్యుదాఘాతానికి గురై స్తంభం పై నుంచి కిందపడ్డాడు. ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. మృతుని సోదరుడు ఫిర్యాదు మేరకు అశ్వారావుపేట ఎస్‌ఐ శ్రీకాంత్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్‌లైన్‌కు అడ్డుగా ఉన్న చెట్టు నరుకుతూ..

విద్యుత్ లైన్‌కు అడ్డంగా ఉన్న చెట్టు నరుకుతూ విద్యుదాఘాతానికి గురై మరో కూలీ దుమ్ముగూడెం మండలంలోని ములకపాడు గ్రామంలో మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. లచ్చిగూడెం విద్యుత్ సబ్‌స్టేషన్ సిబ్బంది 33కేవీ విద్యుత్ లైన్‌కు మరమ్మతులు చేపడుతున్నారు. దీంతో ములకపాడు గ్రామానికి చెందిన కొమరం గోపయ్య(35)ను కూలి పనులకు తీసుకెళ్లారు. ఎల్‌సీ తీసుకుని ములకపాడు రైస్ మిల్లు దగ్గర విద్యుత్ లైన్‌కు అడ్డుగా ఉన్న చెట్టును నరుకుతున్నారు. ఈ క్రమంలో చెట్టు కొమ్మ పక్కనే ఉన్న 11 కేవీ లైన్‌పై పడి విద్యుదాఘాతానికి గురయ్యాడు. దీంతో చెట్టు కొమ్మల్లోనే ఇరుక్కుని గోపయ్య మృతి చెందాడు. మృతుడికి కుమారుడు ఉన్నాడు.

అధికారుల నిర్లక్ష్యంతోనే ఇద్దరు బలి..

అధికారుల నిర్లక్ష్యం ఇద్దరిని బలితీసుకుంది. విద్యుత్ సరఫరా నిలిపివేయకుండా పనులు చేయిస్తుండటంతో మృత్యువాతపడ్డారు. ఇద్దరూ పొట్ట కూటి కోసం పనిచేసే రోజువారీ కూలీలే. పెనుబల్లి కన్నారావు అవివాహితుడు. వయసు మీదపడిన తల్లిదండ్రులను కూలి పనులు చేసుకుంటూ పోషించుకుంటున్నాడు. వినాయకపురంలో సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇవ్వకుండా, సరఫరా నిలిపివేయకుండా వీధిలైట్లు ఏర్పాటు చేయిస్తుండటం వారి నిర్లక్ష్యాన్ని వెల్లడిస్తోంది. స్తంభం ఎక్కి యువకుడు మృతి చెందడంతో వృద్ధ దంపతులు అనాథలయ్యారు. ఆసరా కోల్పోయిన వారు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. దుమ్ముగూడెం మండలం లచ్చిగూడెంలో విద్యుత్ సిబ్బంది 33 కేవీ లైన్‌కు ఎల్‌సీ తీసుకుని చెట్లు నరికిస్తున్నారు. కానీ పక్కనే ఉన్న 11 కేవీలైన్‌లో విద్యుత్ సరఫరా నిలిపివేయలేదు. దీంతో చెట్టు కొమ్మ ఆ లైన్‌పై పడి గోపయ్య మృతి చెందాడు. కూలి పనికి వెళ్లిన వ్యక్తి చెట్టు మీదనే విగతజీవిగా మారాడు. దీంతో ఉన్న ఒక్క కుమారుడు అనాథయ్యాడు. తండ్రి మృతదేహాన్ని చూస్తూ బోరున విలపిస్తున్నాడు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో మృతి చెందడంతో గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. సంఘటనా స్థలాన్ని సీఐ దోమల రమేష్, ఎస్‌ఐ గణేష్ సందర్శించి ఆందోళన కారులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అనంతరం విద్యుత్ శాఖ అధికారులతో కాంగ్రెస్ నాయకుడు లంకా శ్రీనివాసరావు, సొసైటీ డైరెక్టర్ యలమంచి శ్రీనివాసరావులు చర్చలు జరపగా, తగిన న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

‘భారజల’ అధ్యక్షుడిగా కూరపాటి

ప్రధాన కార్యదర్శిగా పోతురాజు, ఉపాధ్యక్షుడిగా రాజేష్ ఎన్నిక



కూరపాటి శ్రీనివాసరావు



పోతురాజు శ్రీనివాసరావు



రాయల రాజేష్

అశ్వాపురం: మణుగూరు భారజల కర్మాగారం ఉద్యోగ సంఘం అధ్యక్షుడిగా టీఎన్‌టీయూసీ సీనియర్ నాయకుడు కూరపాటి శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. భారజల కర్మాగారం ఉద్యోగ సంఘం గుర్తింపు ఎన్నికలు ఈ నెల 11న జరగ్గా, శనివారం ఓట్ల లెక్కింపు చేపట్టారు. ఎన్నికల్లో టీఎన్‌టీయూసీ, ఐఎన్‌టీయూసీ, బీఎంఎస్ ఒక కూటమిగా టీఆర్‌టీయూ, ఏఐటీయూసీ, సీఐటీయూ మరో కూటమిగా పోటీ చేశాయి. 9 ఆఫీస్ బేరర్ స్థానాలకు టీఎన్‌టీయూసీ కూటమి నాలుగు, టీఆర్‌టీయూ కూటమి నాలుగు స్థానాలు గెలుచుకోగా, మరో స్థానంలో స్వతంత్ర అభ్యర్థి గెలిచాడు. ఉద్యోగ సంఘం అధ్యక్షుడుగా కూరపాటి శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షుడిగా ప్రతాపరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పోతురాజు శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీగా ఎస్‌కే.యూసుఫ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సోయం రమేష్, ఆఫీస్ సెక్రటరీగా షేక్ హుస్సేన్ అలీ, వెల్ఫేర్ సెక్రటరీగా ఎం.సందీప్, కోశాధికారిగా యూ.వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడిగా స్వతంత్ర అభ్యర్థి రాయల రాజేష్ విజయం సాధించారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా తొమ్మిది మంది ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఇంజనీర్ల అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



బి.నరేశ్



రఘురామయ్య

ఖమ్మంవ్యవసాయం: ఎన్పీడీసీఎల్ డిప్లొమా ఇంజనీర్ల అసోసియేషన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడిగా బి.నరేశ్, కార్యదర్శిగా రఘురామయ్య ఎన్నికయ్యారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల ఎన్నికలు ఖమ్మంలో శనివారం నిర్వహించారు. కోశాధికారిగా డి.శ్రీకాంత్, కొత్తగూడెం డివిజన్ కార్యదర్శిగా జి.కిషన్, కోశాధికారిగా గౌతమ్, భద్రాచలం డివిజన్ కార్యదర్శిగా రాజారావు, కోశాధికారిగా నరేశ్, సెంట్రల్ డివిజన్ కార్యదర్శిగా కె.లింగయ్య, కోశాధికారిగా సల్మాను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నార్ల సుబ్రహ్మణ్యేశ్వరరావు మాట్లాడుతూ వినియోగదారులకు మెరుగైన సేవలందించాలని తెలిపారు.

జ్వరంతో ఒకరు మృతి

గుండాల: మండల కేంద్రానికి చెందిన రంగు యాకయ్య(40) వారం రోజులుగా జ్వరంతో బాధ పడుతున్నాడు. నాలుగు రోజులపాటు గుండాల ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందాడు. ఆ తర్వాత మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఆర్టీసీ బస్సు, లారీ ఢీ : నలుగురికి గాయాలు

పాల్వంచ రూరల్: ఆర్టీసీ బస్సు, ఇసుక లారీ ఢీకొని నలుగురికి గాయాలైన సంఘటన పాల్వంచ మండలం ఆర్టీఏ చెక్‌పోస్ట్ వద్ద శనివారం జరిగింది. భద్రాచలం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు హైదరాబాద్ నుంచి భద్రాచలం వెళ్తోంది. అదే సమయంలో భద్రాచలం నుంచి ఇసుక లోడ్‌తో పాల్వంచ వైపు వస్తోంది. ఈ క్రమంలో జగన్నాథపురం శివారు ఆర్టీఏ చెక్ పోస్ట్ సమీపంలో జాతీయ రహదారిపై ఓవర్ టేక్ చేయబోయి బస్సును ఢీకొట్టింది. దీంతో బస్సు డ్రైవర్ రెంటాల నాగేశ్వరరావు, క్లీనర్ కల్లూరి సుబ్బారావుతోపాటు చుంచుపల్లికి చెందిన ప్రయాణికుడు భాగం సత్యనారాయణ, మరో ప్రయాణికుడికి గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను ఏరియా ఆస్పత్రికి తరలించారు. లారీ డ్రైవర్ సురేష్ పరారయ్యాడు. సంఘటనా స్థలాన్ని ఎస్‌ఐ కార్తీక్ సందర్శించి, వివరాలు సేకరించారు.

ఆటో, కారు ఢీ : ఆరుగురికి గాయాలు

టేకులపల్లి: ఆటోను కారు ఢీకొని ఆరుగురికి గాయాలైన సంఘటన శనివారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. బొమ్మనపల్లి నుంచి సంపత్‌నగర్ వెళ్లే మార్గంలో కొత్తగుండ్లమడుగు సమీపంలో బొమ్మనపల్లి వైపు వస్తున్న కారు సంపత్‌నగర్ వైపు వెళ్తున్న ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న కె.రమేష్, ఈసం గోపాలస్వామి, మాడె రాధలకు తీవ్ర గాయాలయ్యాయి. మరో ముగ్గురు మేట్ల కుమారి, ఈసం చంద్రశ్రీ, గుగులోత్ అచ్చమ్మ స్వల్పంగా గాయపడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నలుగురు మావోయిస్టు కొరియర్లు అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ వినీత్, అధికారులు

భద్రాచలంఅర్బన్: నిషేధిత మావోయిస్టు పార్టీ కొరియర్లు నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్పీ డాక్టర్ జి.వినీత్ కథనం ప్రకారం.. శనివారం ఉదయం దుమ్ముగూడెం ఎస్సై పి. కేశవరావు తన సిబ్బంది, సీఆర్‌ఎఫ్ 141 బెటాలియన్ సిబ్బందితో కలిసి మండలంలోని గౌరారం గ్రామంలో వాహన తనిఖీలు చేపట్టారు. అదే సమయంలో పైడిగూడెం వైపు నుంచి పెదనల్లబల్లి సెంటర్‌కు అనుమానాస్పదంగా వస్తున్న కారును ఆపేందుకు ప్రయత్నించగా.. కారు ఆపకుండా వెళ్లారు. పోలీసులు వెంబడించి పట్టుకుని విచారణ జరిపారు. వారు కుంజా రఘువరన్, పులిపాటి రవితేజ, బైరెడ్డి సతీష్, ఉబ్బనపల్లి దినేష్ కుమార్‌లుగా, మావోయిస్టు పార్టీ కొరియర్లుగా పనిచేస్తున్నట్లు అంగీకరించారు. వారి నుంచి రూ. 20 లక్షల నగదు, జిలెటిన్ స్టిక్-1, కార్డెక్స్ వైర్ 1/2 మీటర్, డిటోనేటర్-1, రౌండ్స్-2ను స్వాధీనం చేసుకున్నారు. వారిని అదుపులోకి తీసుకుని, కారును సీజ్ చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓఎస్డీ టి.సాయిమనోహర్, భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్, సీఆర్పీఎఫ్ అధికారులు ప్రీతా, చౌరసీయా, దుమ్ముగూడెం సీఐ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మహిళా మావోయిస్టు లొంగుబాటు

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లా ఎస్పీ కిరణ్‌చౌహాన్ ఎదుట మహిళా నక్సలైట్ మడివి మల్లి అలియాస్ గంగి శనివారం లొంగిపోయింది. బీజాపూర్, సుకుమా జిల్లాలో జరిగిన 17 ఘటనల్లో ఆమె నిందితురాలిగా ఉందని, ఆమెపై రూ. 8 లక్షల రివార్డు ఉందని ఎస్పీ తెలిపారు.

హత్య కేసులో నిందితుడు అరెస్ట్

అశ్వారావుపేట: మద్యానికి బానిసై భార్యను హతమార్చిన వ్యక్తిని శనివారం పోలీసులు అరెస్ట్ చేశారు. అశ్వారావుపేట సీఐ కరుణాకర్ కథనం ప్రకారం.. మండలంలోని పండువారిగూడెం గ్రామానికి చెందిన మొడియం పాపారావు పదేళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. మద్యానికి డబ్బులు ఇవ్వడంలేదని భార్య వెంకటలక్ష్మిని పలుమార్లు కొట్టడంతో పెద్దమనుషులు పంచాయితీ కూడా నిర్వహించారు. అయినా మార్పు రాలేదు. ఈ నెల 10న రాత్రి 10 గంటల సమయంలో మద్యం మత్తులోనే.. మళ్లీ మద్యం తాగేందుకు డబ్బులు కావాలని అడిగాడు. ఆమె నిరాకరించడంతో ఇంట్లోని కర్రతో కొట్టాడు. ఆమె కేకలు వేస్తుండగా ఇరుగుపొరుగు వారయిన గుజ్జా వీర్రాజు, సోరెం గోపమ్మ, సోరెం దుర్గారావు అడ్డుకోబోయారు. దీంతో ఇంట్లోని పొట్లకత్తితో వారినీ చంపేస్తానని బెదిరించడంతో వారు వెళ్లిపోయారు. ఇదే అదనుగా భావించి ఇంట్లోని కొడవలితో వెంకటలక్ష్మి మెడ వెనుక భాగంలో బలంగా కొట్టడంతో ఆమె పడిపోయింది. రక్తం కారుతున్న వెంకటలక్ష్మిని మంచంపై పడుకోబెట్టగా చనిపోయింది. అనంతరం ఊరి చివర రేకుల షెడ్డులో హత్యకు ఉపయోగించిన మారణాయుధాలు దాచి, అక్కడే దాక్కుని ఉన్నాడు. గాలింపు చేపట్టిన ఎస్‌ఐలు శ్రీకాంత్, శివరామకృష్ణ శనివారం అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

చోరీకి యత్నించి పట్టుబడిన మహిళలు

భద్రాచలంఅర్బన్: చోరీకి యత్నించి ఇద్దరు మహిళలు శనివారం పట్టుబడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని ఆదర్శ నగర్‌కు చెందిన కిరణ్మయి బ్యాంక్ రోడ్డులో షాపు నడుపుతోంది. శనివారం మధ్యాహ్నం షాపులో ఉన్న నగదును బ్యాగులో పెట్టి ఇంటికి వెళ్తుండగా ఇద్దరు మహిళలు దొంగిలించారు. దీంతో ఆమెతోపాటు దుకాణంలో పనిచేసే సిబ్బంది వెంటపడి పట్టుకుని పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. పోలీసులు విచారణ చేపట్టగా, వారు ఏపీలోని తాడేపల్లి గూడేనికి చెందిన గరిక వరలక్ష్మి, కంభం నాగమణి అని తేలింది. నిందితులను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ నాగరాజు రెడ్డి తెలిపారు.

108 కేజీల గంజాయి సీజ్



వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ అధికారులు

పాల్వంచ: కారులో తరలిస్తున్న గంజాయిని ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ అధికారులు శనివారం పట్టుకున్నారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి తిరుపతిరావు, పాల్వంచ ఎక్సైజ్ సీఐ గురునాథ్ రాథోడ్ కథనం ప్రకారం... పాల్వంచ మండలంలోని ఆర్‌టీఏ చెక్ పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా వస్తున్న కారును ఆపి తనిఖీ చేయగా, 108 కేజీల గంజాయి లభ్యమైంది. కారు సైడ్ డోర్లలో, ఇండికేటర్ హెడ్‌లైట్లలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అలమార్లలో కేజీ ప్యాకెట్లు అమర్చి తరలిస్తున్నారు. నిందితులు, ఉత్తర ప్రదేశ్‌కు చెందిన విజయ పాల్, ఢిల్లీకి చెందిన జిత్తు కుమార్‌ను అరెస్ట్ చేశారు. వీరు ఢిల్లీ నుంచి ఒడిశాకు రైలు మార్గం ద్వారా వచ్చి మల్కన్‌గిరిలో గంజాయిని కేజీ రూ.2 వేల చొప్పున కొనుగోలు చేశారు. అనంతరం ఛత్తీస్‌గఢ్‌లో కారు అద్దెకు మాట్లాడుకుని భద్రాచలం మీదుగా ఢిల్లీకి వెళుతుండగా పాల్వంచలో పట్టుకున్నారు. గంజాయి విలువ సుమారు రూ. 20 లక్షలు ఉంటుందని అంచనా.

పాఠశాల గోడదూకి వెళ్లిన బాలికలు

ఇల్లెందురూరల్: రొంపేడు ఆశ్రమ పాఠశాల నుంచి ఇద్దరు బాలికలు గోడదూకి వెళ్లిపోయిన విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. శుక్రవారం ఉదయం ప్రార్థన సమయంలో గుర్తించిన ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. పాఠశాల హెచ్‌ఎం రవి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా శనివారం మధ్యాహ్నం ఇల్లెందు బస్టాండ్ నుంచి బయటకు వస్తుండగా గుర్తించిన సమీప బంధువు బాలికలను పోలీసులకు అప్పగించారు. విషయం తెలుసుకున్న హెచ్‌ఎం పోలీసుస్టేషన్‌కు చేరుకొని విద్యార్థినిలను తల్లిదండ్రులకు అప్పగించారు. కాగా సమీప బంధువుల ఇంటికి వెళ్లామని వారిలో ఓ బాలిక తెలిపింది.

సిద్దిపేటలో జురాసిక్ పార్క్



డైనోపార్క్ నిర్మాణానికి రూ.12 కోట్ల వ్యయం

సందర్శకుల కోసం ఓపెన్ ట్రైన్ సౌకర్యం

వారంలో ప్రారంభించేందుకు సన్నాహాలు

వందల ఏళ్ల కిందట అంతరించిపోయిన డైనోసార్లకు హాలీవుడ్ దర్శకుడు స్టీవెన్ స్పీల్‌బర్గ్ వెండితెరపై రూపం ఇచ్చి ప్రాణం పోశారు. 1993లో వచ్చిన జురాసిక్ పార్క్ క్రియేట్ చేసిన ట్రెండ్ అంతా ఇంతా కాదు. ఆ తరువాత కూడా ఆ చిత్రానికి కొనసాగింపుగా అనేక సినిమాలు వచ్చి ప్రేక్షకాదరణ పొందాయి. ప్రజలకు డైనోసార్లపై ఉన్న ఆసక్తిని గమనించి ఆ తర్వాత డైనోసార్ థీమ్‌తో ప్రపంచ వ్యాప్తంగా అనేక నగరాల్లో పార్కులు వెలిశాయి. నూతన సాంకేతికతను ఉపయోగించి నిజంగా ప్రాణం పోసుకున్నాయా అన్నట్టుగా డైనోసార్లను తయారుచేసి ప్రదర్శించారు. అభివృద్ధి చెందిన దేశాలకు దీటైన రీతిలో ఇప్పుడు కొత్తగా డైనోపార్క్ మన తెలంగాణలోనూ అందుబాటులోకి రాబోతుంది. దానికి సిద్దిపేట వేదిక కాబోతుంది.

సాక్షి, సిద్దిపేట

విదేశాల్లోని పార్కుల తరహాలో

డైనోపార్క్ అంటే ఏదో ఎగ్జిబిషన్‌లా బొమ్మలు, 3డీ యానిమేషన్ స్క్రీన్లు కాదు. అమెరికా, సింగపూర్‌లలోని యూనివర్సల్ వరల్డ్ స్టూడియోలో ఉన్న డైనోపార్క్‌ల తరహాలో కోమటిచెరువు సమీపంలో పార్క్ నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. ఈ పార్క్ పనులు ఏడాది కిందట మొదలు కాగా ప్రస్తుతం చివరి దశకు చేరుకున్నాయి. వారంలో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

1.5 ఎకరాల విస్తీర్ణంలో..

డైనోసార్ పార్క్‌ను 1.5 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్నారు. ఇందుకోసం సుమారు రూ.12 కోట్లు వెచ్చిస్తున్నారు. ఈ డైనోపార్క్‌లో పెద్ద గుహలు, కొండలు, గుట్టలు, అటవీ ప్రాంతం, లావా, గ్రీనరీ, వాటర్‌ఫాల్స్ ఇలా మూడు వేల శతాబ్దాల కిందట భూమండలం మీద పరిస్థితులు ఎలా ఉండేవో కళ్లకు కట్టినట్టుగా ఏర్పాటు చేస్తున్నారు. పార్కులో వివిధ రకాల డైనోసార్‌లు, వాటి గుడ్లు, అస్థిపంజరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి సిలికాన్ డైనోసార్లను ఇక్కడ అందుబాటులో ఉంచుతున్నారు. ఇవి పార్కు ఆవరణలో అటూ ఇటూ కలియతిరుగుతూ భీకరంగా శబ్దాలు చేస్తూ సందర్శకులను సంభ్రమాశ్చర్యాలకు గురిచేసేందుకు సిద్ధమవుతున్నాయి.

వాకింగ్ డైనో..

ఈ డైనో థీమ్ పార్క్‌లో వాకింగ్ డైనోసార్‌ను సైతం ఏర్పాటు చేస్తున్నారు. దీనిలో చిన్నారులు కూర్చుంటే నడుచుకుంటూ వెళ్తుంది. ఒకేసారి ఆరుగురు చిన్నారులు కూర్చునే విధంగా రూపొందించారు. అలాగే లోపల గుహల్లో తిరుగుతున్న సమయంలో సెల్ఫీ పాయింట్‌ను ఏర్పాటు చేశారు. డైనోసార్ గుడ్డులో నుంచి పిల్ల బయటకు వస్తుండగా సెల్ఫీ తీసుకునే అవకాశం ఉంటుంది. పార్క్‌ను చూసేందుకు వస్తున్న పిల్లలను అలరించేందుకు డైనోసార్ సూట్ వేసుకుని ఇద్దరు తిరగనున్నారు.

మినీ ట్రాక్.. ఓపెన్ ట్రైన్

డైనోసార్ పార్కులో ఉన్న వింతలు విశేషాలను చూసేందుకు వీలుగా 240 మీటర్ల నిడివితో మినీ ట్రాక్‌ను నిర్మించారు. దీనిపై ఓపెన్‌ట్రైన్ నడుస్తుంది. ఈ ట్రైన్‌లో 3 బోగీలు ఉండగా ఒక్కో బోగీలో ఆరుగురు కూర్చునే వీలుంది. ఈ ఓపెన్ ట్రైన్‌లో తిరుగుతున్న సమయంలో సందర్శకులకు సరికొత్త అనుభూతిని ఇచ్చేలా ఒక్కసారిగా డైనోసార్‌లు మీదపడినట్టు, భీకరంగా అరవడం లాంటివి చేసేలా పార్క్‌ను డిజైన్ చేశారు.



డైనోపార్క్‌లో గుహలు, డైనోసార్‌లు

గుజరాత్‌ను మించేలా..

మన దేశంలో గుజరాత్‌లోని రయోలిలో డైనోసార్ గుడ్లు లభించాయి. దీంతో అక్కడ డైనోసార్ మ్యూజియం ఏర్పాటు చేశారు. ఈ మ్యూజియంలో నిలకడగా ఉండే డైనోసార్‌లను ప్రదర్శనకు ఉంచారు. డైనోసార్లలో ఒక్కటి మాత్రమే అరుస్తూ.. తోక ఊపుతుంది. కానీ సిద్దిపేటలో ప్రారంభంకాబోతున్న పార్క్‌లో కదిలే డైనోసార్లు 18 ఉన్నాయి. ఇవికాకుండా మరో ఐదు నిలకడగా ఉండేవి ఏర్పాటు చేశారు. ఒక రకంగా దేశంలో ఇదే అత్యుత్తమ, అత్యంత పెద్ద డైనోసార్ పార్క్ అని అంటున్నారు.

కొత్త అనుభూతి కలిగిస్తుంది



కోమటి చెరువులో మరో మణిహారంగా డైనోసార్ పార్క్ ఏర్పాటు కాబోతుంది. ఇప్పటికే రాక్‌గార్డెన్, గ్లో గార్డెన్, అడ్వెంచర్ పార్క్‌ల చెంతన వినూత్నమైన రీతిలో కొత్త అనుభూతిని కలిగించేలా డైనోసార్ పార్క్ అందుబాటులోకి రానుంది. సాహస అనుభవాలని, జ్ఞాపకాలని, మధురానుభూతిని కలిగించేలా డైనోసార్ పార్కు ఉంటుంది. దేశంలో ఎక్కడాలేని విధంగా సిద్దిపేటలో ఈ పార్క్ ఉండబోతుంది.

–హరీశ్‌రావు, రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి

అయ్యో.. ఆరేళ్లకే నూరేళ్లు!

- తిరుమల కొండపై బాలికను చంపేసిన వన్యమృగం
- అలిపిరి నడక మార్గంలో శుక్రవారం రాత్రి చిన్నారి అదృశ్యం
- అటవీ ప్రాంతంలో శనివారం మృతదేహం లభ్యం
- చిరుతా, ఎలుగుబంటా అనేది అనుమానం



చిన్నారి లక్షిత (ఫైల్ ఫొటో)



కుమార్తె లక్షిత మృతితో విలపిస్తున్న తల్లి శశికళ

తిరుమల/కోవూరు: తిరుమల కొండపై తీవ్ర విషాదం చోటుచేసుకుంది. అలిపిరి నడకదారిలో శుక్రవారం రాత్రి ఆరేళ్ల చిన్నారి నడుస్తుండగా అకస్మాత్తుగా ఓ వన్యమృగం చేసిన దాడిలో మృత్యువాత పడింది. నరసింహస్వామి ఆలయం సమీపంలోని అటవీ ప్రాంతం వద్ద ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరు మండలం, పోతిరెడ్డిపాళేనికి చెందిన దినేష్‌కుమార్, శశికళ కుమార్తె లక్షిత (6) కుటుంబసభ్యులతో కలిసి శుక్రవారం తిరుపతికి చేరుకున్నారు. మ.3.30 గంటల ప్రాంతంలో వారంతా అలిపిరి నడకమార్గం ద్వారా తిరుమలకు కాలినడకన బయల్దేరారు. రాత్రి 7.30 గంటల సమయంలో బాలిక నరసింహస్వామి ఆలయం సమీపంలో అదృశ్యమైంది. తల్లిదండ్రుల కంటే ముందుగానే ఆ చిన్నారి నడుస్తుండడంతో వేరే భక్తుల గుంపులో కలిసి వెళ్లి ఉంటుందని తల్లిదండ్రులు తొలుత భావించి వెతకడం ప్రారంభించారు. ఎంతకూ కనపడకపోవడంతో చివరికి అక్కడున్న భద్రతా సిబ్బందికి తెలిపారు. రాత్రి 10.30కు తిరుమల టూటౌన్ పోలీసులకు బాలిక అదృశ్యంపై ఫిర్యాదు అందింది. దీంతో తిరుమల వన్‌టౌన్ సీఐ జగన్మోహన్‌రెడ్డి, టూటౌన్ సీఐ చంద్రశేఖర్ అటవీ ప్రాంతంలో గాలింపు చేపట్టారు. రాత్రి నుంచి దాదాపు 70 మంది టీటీడీ, అటవీశాఖ సిబ్బంది, పోలీసులు గాలింపు చేపట్టారు. శనివారం ఉ.6 గంటల ప్రాంతంలో నరసింహస్వామి ఆలయం సమీపంలోని నడకదారి నుంచి 150 మీటర్ల దూరంలో ఉన్న అటవీ ప్రాంతంలో బాలిక మృతదేహాన్ని గుర్తించారు. పూర్తిగా ముఖాన్ని జంతువు తినడంతోపాటు, కాలిని తీవ్రంగా గాయపర్చింది. దీంతో బాలిక అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలుస్తోంది. చిరుత లేదా ఎలుగుబంటి దాడిచేసి ఉండవచ్చని భావిస్తున్నారు.

ఘటన తీవ్రంగా కలిచివేసింది : ఈఓ ధర్మారెడ్డి

చిన్నారి మృతి తమను తీవ్రంగా కలిచివేసిందని టీటీడీ ఈఓ ధర్మారెడ్డి తెలిపారు. సంఘటన స్థలాన్ని శనివారం ఆయన పరిశీలించి మీడియాతో మాట్లాడారు. మృతురాలి కుటుంబానికి టీటీడీ నుంచి రూ.5 లక్షలు, అటవీశాఖ నుంచి రూ.5 లక్షలు అందిస్తామని చెప్పారు. బాలిక ఒంటరిగా వెళ్లడాన్ని సీసీ కెమెరాల్లో గుర్తించామన్నారు. బాలిక నరసింహస్వామి ఆలయానికి సమీపంలో నడకదారి నుంచి పక్కకు అటవీ ప్రాంతంలోకి ఆడుకుంటూ వెళ్లినట్లు అనుమానిస్తున్నామన్నారు. ఎందుకంటే.. బాలిక ఆటవస్తువులు అటవీ ప్రాంతంలోనే దొరికాయని తెలిపారు. ఈ సమయంలో వన్యమృగం దాడిచేసి తీసుకెళ్లినట్లు తెలుస్తోందన్నారు.

భద్రత విషయంలో రాజీలేదు : భూమన

ఇక తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తుల భద్రత విషయంలో రాజీపడే ప్రసక్తేలేదని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి స్పష్టంచేశారు. సంఘటనకు దారితీసిన పరిస్థితులపై శనివారం సాయంత్రం అధికారులతో ఆయన మాట్లాడారు. అనంతరం బాలిక లక్షిత మృతదేహం లభించిన ప్రాంతాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ ఘటనలో ఎవరి నిర్లక్ష్యంలేదని ఆయన మీడియాతో అన్నారు.

అధికారులతో అత్యవసర సమావేశం

మరోవైపు.. అలిపిరి, శ్రీవారి మెట్టు నడక మార్గాల్లో మరింత భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు టీటీడీ, అటవీ పోలీస్ అధికారులతో జరిపిన అత్యవసర సమావేశంలో ఈఓ తెలిపారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నడకమార్గంలో 500 సీసీ కెమెరాలు ఏర్పాటుచేస్తామని చెప్పారు. నడక మార్గానికి ఇరువైపులా కంచె ఏర్పాటుచేసేందుకు సమగ్ర నివేదిక అందించాలని డీఎఫ్‌ఓను ఆయన ఆదేశించారు. అలాగే, వన్యమృగాన్ని బంధించేందుకు బోను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతీ 100 మంది భక్తుల గుంపునకు సెక్యూరిటీ సిబ్బంది ఏర్పాటుకు అనుమతించనున్నట్లు చెప్పారు. అలాగే, నడకదారుల్లో మ.2–3 గంటల వరకు మాత్రమే భక్తులను అనుమతించే అంశాలపై సాధ్యాసాధ్యాలను పరిశీలించి నిర్ణయం తీసుకుంటామన్నారు. చిన్నపిల్లలతో నడకమార్గాల్లో వచ్చే తల్లిదండ్రులు వారిని జాగ్రత్తగా చూసుకోవాలని ఈఓ విజ్ఞప్తి చేశారు. సీసీఎఫ్ నాగేశ్వరరావు మాట్లాడుతూ, బోన్ల సాయంతో నడక మార్గాల్లో సంచరించే వన్య మృగాలను బంధిస్తామన్నారు.



తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ శనివారం ఉదయం దర్శించుకున్నారు. స్వామివారి దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో చీఫ్ జస్టిస్‌కు పండితులు వేద ఆశీర్వాదం చేశారు. అలాగే ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజాత, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రంగస్వామి నటరాజ్ కూడా స్వామివారిని దర్శించుకున్నారు.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆందోళనకరం

- బ్రాహ్మణ పరిషత్ ఉద్యోగులకు అందని జీతాలు
- ప్రభుత్వ సలహాదారు రమణాచారి వ్యాఖ్యలు

హిమాయత్‌నగర్ (హైదరాబాద్): ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి చాలా ఆందోళనకరంగా ఉందని తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ అధ్యక్షుడు, ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈ విషయాన్ని ఎవరు ఒప్పుకున్నా.. ఒప్పుకోకపోయినా వాస్తవమని ఆయన స్పష్టం చేశారు. శనివారం రాత్రి హిమాయత్‌నగర్‌లోని ఓ హోటల్లో జరిగిన జానపద కళాకారుల సంఘం రాష్ట్ర స్థాయి సమావేశంలో కేవీ రమణాచారి మాట్లాడుతూ.. తాను అధ్యక్షత వహిస్తున్న బ్రాహ్మణ పరిషత్‌లోని ఉద్యోగులకు ఈనెల ఇంకా జీతాలు విడుదల కాలేదని తెలిపారు. ఈ విషయాన్ని పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసికెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు మూడు నెలలుగా పెన్షన్లు రావడం లేదని, డబుల్ బెడ్‌రూమ్‌లు వచ్చేలా చొరవ చూపాలని కోరిన తెలంగాణ జానపద కళాకారుల సంఘం రాష్ట్ర స్థాయి నేతలను ఉద్దేశించి ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. నిరసనలు, డిమాండ్‌ల ద్వారానే ప్రభుత్వం దృష్టికి సమస్య తీసుకెళ్లాలని వారికి సూచించారు. అంతకుముందు ఇటీవల మరణించిన గద్దర్, సాయిచంద్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జిల్లా వార్తలు

రాష్ట్రస్థాయి రెడ్ రన్‌లో విజేతగా సమ్రీన్



ట్రోఫీ అందుకుంటున్న సమ్రీన్

ఖమ్మంస్పోర్ట్స్: తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణమండలి ఆధ్వర్యాన శనివారం హైదరాబాద్‌లో 5కే రెడ్ రన్ నిర్వహించారు. ఈ పోటీల్లో ఖమ్మం జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన ఎస్కే సమ్రీన్‌కు ప్రథమస్థానం లభించింది. ఖమ్మం ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న ఆమె విజేతగా నిలిచి రూ.35 వేల నగదు బహుమతితోపాటు ట్రోఫీ అందుకుంది. ఈ సందర్భంగా సమ్రీన్‌ను డీఎంహెచ్‌ఓ మాలతి, అడిషనల్ డీఎంహెచ్‌ఓ ప్రవీణ, జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ మేనేజర్ సత్యకుమార్, ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ జకీరుల్లా, ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు ఎన్.శ్రీనివాస్, మిల్టన్, సర్వేశ్వర్, పీడీ డాక్టర్ బి.వెంకన్న, డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, కోచ్‌లు ఎండీ గౌస్, అక్బర్‌అలీ అభినందించారు.

కోదండరాం తదితరుల అరెస్టు గర్హనీయం

ఖమ్మంమయూరిసెంటర్: గ్రూప్–2 పరీక్ష వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ మౌన దీక్షకు పూనుకున్న ప్రొఫెసర్ కోదండరాం, ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ తదితరులను అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్ గన్‌పార్కులో దీక్ష చేయనున్నట్లు ముందుగానే ప్రకటన చేసినా, ప్రభుత్వం, పోలీసులు నాయకులు పలువురిని అరెస్ట్ చేయగా, మరికొందరిని గృహనిర్బంధం చేశారని ఆరోపించారు. తొమ్మిదేళ్ల ఉద్యోగాల భర్తీని పట్టించుకోని ప్రభుత్వం ఇప్పుడు ఎన్నికలు వస్తుండడంతో హడావుడి చేస్తుండగా నిరుద్యోగులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యాన గ్రూప్–2 పరీక్ష వాయిదా వేయాలని డిమాండ్ చేస్తే అరెస్ట్ చేయడం సరికాదని, ఇకనైనా పరీక్షను వాయిదా వేయాలని రంగారావు డిమాండ్ చేశారు.

బీట్ ఆఫీసర్‌పై వేటుతో సరిపెడతారా?

- మొత్తం వ్యవహారంలో ఒక్కడినే బాధ్యుడిని చేస్తే ఎలా?
- జేకేఓసీ నిర్వాసిత జాబితా పెరగడంపై విచారణలో అడుగడుగునా నిర్లక్ష్యం
- ప్రాథమిక దశ నుంచి పరిశీలిస్తే బయటపడనున్న అక్రమాలు
- ఆ దిశగా పరిశీలించని అటవీశాఖ



గ్రామసభలో నిర్వాసిత జాబితాపై అభ్యంతరం తెలుపుతున్న రైతులు (ఫైల్)

ఇల్లెందురూరల్: సింగరేణి సంస్థ ఇల్లెందు ఏరియాలోని జేకేఓసీ ప్రాజెక్టు ప్రారంభం కోసం సింగరేణి, రెవెన్యూ, అటవీశాఖలు సంయుక్తంగా చేపట్టిన సర్వే, కసరత్తు ఆదిలోనే వివాదాస్పదమవుతోంది. ఓసీ నిర్వాసిత జాబితాలో రైతుల పేర్ల నమోదు విషయమై అక్రమాలు చోటుచేసుకున్నాయని గుర్తించిన అటవీశాఖ అధికారులు విచారణ చేపట్టారు. అయితే, పూర్తిస్థాయిలో విచారణ చేయకుండానే చిరుద్యోగి అయిన బీట్ అధికారిపై సస్పెన్షన్ వేటు వేసి చేతులు దులుపుకున్నట్లు విమర్శలు వస్తున్నాయి. అసలు ఈ మొత్తం వ్యవహారంలో చాలామంది హస్తం ఉండగా ఒక్కరినే బాధ్యుడిని చేయడం ఏంటనే చర్చ సాగుతోంది.

రైతుల జాబితాను పరిశీలించరా?

ఇల్లెందులో జేకే–5 ఓసీలో బొగ్గు నిల్వలు తరిగిపోవడంతో సింగరేణి యాజమాన్యం జేకేఓసీ ఏర్పాటుకు సన్నాహాలు చేపట్టింది. ఈ మేరకు ఇల్లెందు మండలం సీఎస్పీ బస్తీ గ్రామ పంచాయతీ సమీపాన అటవీశాఖ పరిధిలోని సర్వే నంబర్ 549 పరిధిలో 261.33 హెక్టార్ల భూభాగాన్ని గుర్తించారు. ఇందులో 154 హెక్టార్లు అటవీభూభాగం కాగా, మిగిలింది రెవెన్యూ భూమి అని తేలింది. అయితే, అటవీశాఖ పరిధిలోని భూమిలో కొందరు సాగు చేసుకుంటున్నట్లు సింగరేణి అధికారులు గుర్తించారు. కానీ, 52 మంది రైతులు వాస్తవంగా సాగులో ఉన్నప్పటికీ, ఓ గిరిజనేతరుడు రంగప్రవేశం చేసి.. జరిపిన క్రయవిక్రయాల కారణంగా జాబితాలో కొత్తగా మరో 36 పేర్లు చేరాయి. ఆతర్వాత 2021 జూలై 31 నాటికి ఈ సంఖ్య 107కు చేరగా.. ఆర్‌ఓఎఫ్‌ఆర్ గ్రామసభ నాటికి 114కు పెరగడం గమనార్హం. ఈ అంశంపై విచారణ చేపట్టేందుకు అధికారులు దృష్టి సారించకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

ప్రాథమిక దశ నుంచే అక్రమాలు

సింగరేణి, రెవెన్యూ, అటవీశాఖల అధికారులు జేకేఓసీ నిర్వాసిత భూభాగాన్ని గుర్తించాక సాగు చేస్తున్న రైతుల గుర్తింపునకు ఎంజాయ్‌మెంట్ సర్వే చేపట్టారు. ఈ క్రమంలోనే కొన్ని కొత్త పేర్లు జాబితాలో చేరగా కొన్నాళ్లకు మరికొన్ని పేర్లు నమోదైనట్లు సమాచారం. నిర్దేశించిన భూమిలో ఖాళీగా ఉన్న ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని పలువురు రైతుల పేర్లను అధికారులు జాబితాలో చేర్చారని తెలిసింది. అలాగే, మరో గిరిజనేతరుడు చేపట్టిన కొనుగోళ్లపై దృష్టి సారించిన పెద్దలు అందులో ఎనిమిది పేర్లు, గతంలో పేర్కొన్న విధంగా 36 మంది నుంచి ఇద్దరి పేర్లను తొలగించి వారు అనుకున్న పేర్లు చేర్చగా... ఎంజాయ్‌మెంట్ జాబితాలో ట్రాక్ నంబర్ 50 నుంచి 67 వరకు పేర్లు మారినట్లు ఆరోపణలున్నాయి. ఇందులో కొందరు అధికారుల బంధువులకు భూమి లేకున్నా నిర్వాసితులుగా చేర్చారనే విమర్శలు వస్తున్నాయి. ఇదే సమయాన పేర్లు చేరుస్తామని పలువురు డబ్బు వసూలు చేసినట్లు అటవీశాఖ అధికారులు గుర్తించినా ఒక్క బీట్ అధికారిని మాత్రమే బాధ్యుడిగా చేయడం ప్రశ్నార్థకంగా మారింది.

ప్రక్రియలో ఎవరెవరు బాధ్యులంటే..

ఓసీ నిర్వాసిత ప్రాంత ఎంజాయ్‌మెంట్ సర్వే, గ్రామసభ మొత్తం ఆర్డీఓ పర్యవేక్షణలో సాగింది. నిర్వాసిత ప్రాంతంలో అటవీ భూమి, రైతుల వివరాలను అటవీశాఖ ఉన్నతాధికారుల పర్యవేక్షణలో నిర్ధారించాల్సి ఉంటుంది. అయినా జాబితాలో అదనపు పేర్లు ఎలా చేరాయి.. ఇందుకు కారకులెవరనేది పరిశీలించకుండా కేవలం డబ్బు వసూలు చేసిన వారి విషయంపై విచారణ నిర్వహించడం గమనార్హం. కాగా, జేకేఓసీ నిర్వాసిత ప్రాంతానికి అనుకుని ఉన్న అటవీభూమిలో సర్వే సాగుతుండగానే సుమారుగా రెండు ఎకరాల విస్తీర్ణంలో గుర్తు తెలియని వ్యక్తులు అడవిని నరికివేశారు. ఈ విషయంలో సమగ్రంగా విచారణ జరుపుతామని చెప్పినా అధికారులు ఆ ఊసెత్తడం లేదు.

అన్ని అంశాల్లో విచారణ



జేకేఓసీ నిర్వాసిత జాబితాకు సంబంధించి ఎంజాయిమెంట్ సర్వేలో ప్రతీ ప్రక్రియపై సమగ్రంగా విచారణ జరుగుతోంది. నిర్వాసిత జాబితాలో పేర్లు ఎందుకు పెరిగాయి. భూమి క్రయవిక్రయాలు ఎలా జరిగాయనే అంశంపై విచారణ చేపట్టాలని అప్పటికే ఆదేశించాం.

–కె.వెంకన్న, అటవీశాఖ ఇల్లెందు డివిజన్ అధికారి

అధ్యాపకుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలంటౌన్: గిరిజన సంక్షేమ కళాశాలల్లో వివిధ సబ్జెక్టులు బోధించేందుకు తాత్కాలిక పద్ధతిపై అధ్యాపకులను నియమించనున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ తెలిపారు. డిగ్రీ, పీజీలో 55 శాతం మార్కులతో పాటు ఏదైనా యూనివర్సిటీ నుంచి బీఈడీ పూర్తిచేసిన మహిళా అభ్యర్థులు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. గుండాల, సుదిమళ్ల, వైరా, తిరుమలాయపాలెం, సింగరేణి, అంకంపాలెం, ఖమ్మం కళాశాలల్లో పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

ఆసక్తి, అర్హతలు కలిగిన అభ్యర్థులు ఈ నెల 14 నుంచి 18వ తేదీ వరకు భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

28 మంది వైద్యులకు నియామక ఉత్తర్వులు



వైద్యులకు నియామకపత్రాలు అందజేస్తున్న అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి పరిధిలోని ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న వైద్యుల భర్తీకి ఇటీవల నోటిఫికేషన్ జారీ చేసి ఎంపిక చేశారు. ఈ మేరకు ఎంపికైన 28 మందికి శనివారం సింగరేణి రిక్రూట్‌మెంట్ సెల్ జీఎం కట్టా బసవయ్య కొత్తగూడెంలో నియామక ఉత్తర్వులు అందజేశారు. సంస్థలో 30 మంది వైద్యులను కాంట్రాక్టు విధానంలో నియమించేందుకు జూలై 31న నిర్వహించిన ఇంటర్వ్యూలకు 84 మంది హాజరయ్యారని తెలిపారు. వారిలో 30 మందిని ఎంపిక చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో అధికారులు ధన్‌పాల్ శ్రీనివాస్, పి.వేణుగోపాల్, నాగరాజు, డి.నాగేశ్వరరావు, సంతోష్‌కుమార్, వెంకటరమణ పాల్గొన్నారు.

'సింగరేణి'లో ఉత్తమ కార్మికులు వీరే..



మోహన్‌బాబు సాంబశివరావు భూక్యా సక్రు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో విధులు నిర్వర్తించే వారి నుంచి ఏటా పంద్రాగస్టుకు పలువురు ఉత్తమ ఉద్యోగులను ఎంపిక చేసి కొత్తగూడెంలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సన్మానించనున్నారు. ఈసారి సంస్థ వ్యాప్తంగా 12 మంది ఉత్తమ ఉద్యోగులను ఎంపిక చేసిన అధికారులు శనివారం వివరాలు వెల్లడించారు. వారిలో మణుగూరు ఏరియా నుంచి ఈపీ ఎలక్ట్రీషియన్ జి.మోహన్‌బాబు, ఇల్లెందు ఏరియా నుంచి ఫిట్టర్ ఆర్.సాంబశివరావు, కొత్తగూడెం నుంచి ఈపీ ఆపరేటర్ భూక్యా సక్రు ఉన్నారు. అలాగే, భూపాలపల్లి ఏరియా నుంచి హెడ్ ఓవర్‌మెన్ పి.నారాయణమూర్తి, ఆర్‌జీ–3 ఏరియా నుంచి ఈపీ ఆపరేటర్ కె.మల్లేశ్, అండ్రియాల ప్రాజెక్టు నుంచి ఎల్‌హెచ్‌డీ ఆపరేటర్ అబ్దుల్ హమీద్, జీడీకే–2 ఏరియా నుంచి ఈపీ ఆపరేటర్ దినేశ్‌సింగ్, ఆర్‌జీ–1 ఏరియా నుంచి ఫిట్టర్ ఎస్.కృష్ణమాచారి, బెల్లంపల్లి ఏరియా నుంచి ఫోర్‌మెన్ శ్రీరామగిరి శ్రీనివాస్, మందమర్రి ఏరియా నుంచి ఈపీ ఆపరేటర్ వి.రమేశ్, శ్రీరాంపూర్ ఏరియా నుంచి ఎస్‌డీఎల్ ఆపరేటర్ పి.తిరుపతి, ఎస్టీపీపీ నుంచి సీనియర్ అసిస్టెంట్ ఎం.మహేశ్ ఎంపికైనట్లు అధికారులు వెల్లడించారు.

బుట్టదాఖలైన ఉచిత విద్య హామీ

- మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య
- ఇల్లెందులో పీడీఎస్‌యూ రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, పక్కన ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ తదితరులు

ఇల్లెందు: స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు దాటుతున్నా అట్టడుగు వర్గాలు, పేదలకు ఉచిత విద్యనందించడంలో పాలకులు విఫలమయ్యారని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఇల్లెందులోని ఎల్లన్న విజ్ఞాన కేంద్రంలో మూడు రోజుల పాటు జరగనున్న పీడీఎస్‌యూ రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞానిక రాజకీయ శిక్షణ తరగతులు శనివారం మొదలయ్యాయి. ఈ సందర్భంగా ఆయన ప్రారంభోపన్యాసం చేస్తూ విద్యను వ్యాపారంగా మార్చడంతో పేదలు చదువుకు దూరమవుతున్నారని, తద్వారా ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రెండు దఫాలు అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ప్రభుత్వం ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి హామీలను విస్మరించిందని ఆరోపించారు. ఇక కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం సైతం అదే దారిలో పయనిస్తోందని తెలిపారు. అనంతరం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కె.లక్ష్మీనారాయణ.. 'నూతన జాతీయ విద్యా విధానం – పర్యవసానాలు' అంశంపై మాట్లాడుతూ విద్యార్థుల్లో లౌకిక, ప్రజాస్వామిక, శాస్త్రీయ భావాలను పెంపొందించాలని రాజ్యాంగం పేర్కొంటే.. బీజేపీ ప్రభుత్వం ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. పుస్తకాల్లో శాస్త్రీయ భావాలను తొలిగించి కుల, మత, జాతి వైషమ్యాలను రెచ్చగొట్టేలా పాఠ్యాంశాలను మారుస్తోందని తెలిపారు. యూనివర్సిటీల అభివృద్ధిని పూర్తిగా విస్మరించిన పాలకులు ప్రొఫెసర్ పోస్టులను కూడా భర్తీ చేయటం లేదని మండిపడ్డారు. ఈ మేరకు ప్రభుత్వ విద్యను పరిరక్షించుకునే బాధ్యత విద్యార్థి, యువజనులపై ఉందని తెలిపారు. ఆ తర్వాత పీడీఎస్‌యూ యూనివర్సిటీల కోఆర్డినేషన్ జాతీయ కన్వీనర్ ఎస్.నాగేశ్వరరావు 'గతి తర్కం–హేతువాదం' అంశంపై మాట్లాడారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి.రామకృష్ణ ఎస్.ఆజాద్ పీడీఎస్‌యూ జెండాను ఆవిష్కరించారు. అలాగే, విద్యార్థి అమరవీరుల సంతాప తీర్మానం ప్రవేశపెట్టి మౌనం పాటించారు. ఈ సభలో పీడీఎస్‌యూ నాయకులు కాంపాటి పృథ్వీ, నరేందర్, భాస్కర్, ఎస్.అనిల్, నర్సింహారావు, కె.సంధ్య, స్వాతి, సాయి, నరేందర్, వెంకటేశ్, నరేశ్, సుమంత్, హలీం పాషా, తిరుపతి, దీపిక, పవిత్ర, గణేశ్, అశూర్, నవీన్, కావ్య, సీతారాం, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌లగ్జరీ బస్సుల్లో వాటర్ బాటిళ్లు..



వాటర్ బాటిళ్లతో డీఎం, ఉద్యోగులు

సత్తుపల్లిటౌన్: ఆర్టీసీ సూపర్‌లగ్జరీ బస్సుల్లో ప్రయాణించే వారికి అర లీటర్ జీవా వాటర్ బాటిల్లు అందించనున్నారు. ఏసీ బస్సులతో పాటు సూపర్ లగ్జరీ ప్రయాణికులకు కూడా వాటర్ బాటిళ్లు ఇవ్వాలని యజమాన్యం నిర్ణయించింది. ఈమేరకు సత్తుపల్లి డిపోలో శుక్రవారం డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మి బాటిళ్ల పంపిణీని ప్రారంభించారు. ఉద్యోగులు ఖుద్దూస్, రాంకుమార్, జి.వెంకటేశ్వర్లు, డీవీఆర్‌ఎస్.రావు, వి.ప్రభాకర్, కిన్నెర ఆనందరావు పాల్గొన్నారు.